నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 23 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## విద్యావ్యవస్థను కాంగ్రెస్ సర్కారు గాలికి వదిలేసింది

- సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు శృతిక
- ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపిన ఉద్యోగులు

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 22: విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు శృతిక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కోసం ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మెలో భాగంగా ఆదివారం ఒంటి కాలిపై నిల్చుండి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకురాలు శృతి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 13 రోజులుగా శాంతియుత వాతావరణంలో నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సీఆర్‌టీ పోస్టులను తాత్కాలిక పద్ధతిన నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం తగదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఎవరూ కూడా దరఖాస్తు చేసుకోవద్దని అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేశ్, మీడియా ప్రతినిధి సంతోష్ నాయకులు సందీప్, అన్నపూర్ణ, చైతన్య, ప్రశాంత్, రాజేశ్, కవిత, అనుప్, రాజేశ్, వెంకటేశ్, స్వప్న, సత్యనారాయణ, తిరుపతి, మహేశ్, ప్రసన్న, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోవలక్ష్మి కుమారుడి వివాహ వేడుకల్లో కేటీఆర్



కోవలక్ష్మి కుమారుడి వివాహానికి హాజరైన కేటీఆర్

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 22: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి కుమారుడు కోవ సాయినాథ్ వివాహానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, జోగు రామన్న, సత్యవతి రాథోడ్‌తో పాటు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పురాణం సతీశ్, ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరయ్యారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కోవలక్ష్మి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పాలరాపు గుట్ట వద్ద రాబంధుల స్థావరాన్ని సందర్శించేందుకు పెద్దవాగు దాటుతున్న ఎఫ్‌బీవోలు

## ట్రైయినీ ఎఫ్‌బీవోల పర్యటన

బెజ్జూర్/పెంచికల్‌పేట డిసెంబర్ 22 : హైదరాబాద్ దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 58 మంది ఎఫ్‌బీవోలు ఆదివారం బెజ్జూర్ అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అకాడమీ అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో బెజ్జూర్ రెంజ్, కుశ్నపల్లి సెక్షన్‌లో పర్యటించి ఇందిర్‌గాం బీట్‌లో అటవీ సంరక్షణ చర్యలు, గడ్డి మైదానాల పెంపకంపై తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో విశేషమైన రాముడు–భీముడు టేకు చెట్టును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రావణ్, ఎఫ్‌బీవోలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెంచికల్‌పేట మండలంలోని నందిగాం బీట్ పరిధిలోని పాలరాపు గుట్ట వద్ద రాబంధుల స్థావరాన్ని సందర్శించారు. అంతరించిపోతున్న రాబంధుల సంరక్షణ, అటవీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వో జగన్మోహన్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.



బెజ్జూర్ అడవిలోని 'రాముడు-భీముడు' చెట్టును పరిశీలిస్తున్న ట్రైనీ ఎఫ్‌బీవోలు

## మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలీసుల ప్రత్యేక చర్యలు

# గిరిజనులకు సేవ.. యువతతో మైత్రి

- మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గింది
- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీ.వీ. శ్రీనివాస్ రావు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో 'పోలీసులు మీకోసం.. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో ఇటీవల కాలంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారు. వారం రోజుల వ్యవధిలో పెంచికల్‌పేట, సిర్పూర్–యూ, బెజ్జూర్‌లో మండలాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి దుప్పట్లు, ఇతర గృహ వినియోగ వస్తువులను, యువతకు స్పోర్ట్స్ కిట్లను అందించారు. ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో'గిరిజనులకు సేవా..యువతతో మైత్రి' అనే కోణంలో వారికి దగ్గరయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అసాంఘిక శక్తుల కార్యకలాపాలను పూర్తిగా అరికట్టడంతో పాటు, ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

### మారుమూల ప్రాంతాల్లో పోలీసుల సేవలు

గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గిరిజన ప్రాంతాలను గుర్తించి జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడా గ్రామం నుంచి 30 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరిన చౌదరి అంకుబాయి కుటుంబానికి పోలీసులు సహాయ సహకారాలు అందించారు. ఈ గ్రామంలో 'పోలీసులు మీకోసం' పేరుతో కార్యక్రమం నిర్వహించి అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని గ్రామస్తులను కోరారు. చౌదరి అంకుబాయి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. బెజ్జూర్ మండలంలోని నాగవెల్లిలో ఇటీవల 'పోలీసులు మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించి గిరిజనులకు దుప్పట్లు, యువతకు స్పోర్ట్స్ కిట్లు అందించారు. యువతకు ఆకట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. దొడ్డిగూడ, మోగవెల్లి గ్రామాల ప్రజలను సుమారు 300 మందిని సమీకరించి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్–యూ మండలంలోని పవార్‌గూడా గ్రామంలో 'పోలీసులు మీకోసం' ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.



అగర్‌గూడా నుంచి చౌదరి అంకుబాయి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న పోలీసులు

### తగ్గిన మావోయిస్టుల ప్రభావం

ఒకప్పుడు మావోయిస్టులు మంచిపట్టు కలిగి ఉన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గింది. నాలుగేళ్ల క్రితం తిర్యాణి అడవుల్లో మావోయిస్టుల్లో రిక్రూట్‌మెంట్ కోసం తిరిగిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ పోలీసుల నుంచి తృటిలో తప్పించుకున్నాడు. జిల్లాలో మావోయిస్టుల కదలికలను పోలీసులు గుర్తించిన కొద్ది రోజులకే కదంబా అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కదంబా అడవుల్లో చత్తీస్‌గఢ్– బీజాపూర్‌కు చెందిన మావోయిస్టు చుక్కాలు, ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన జుగ్నక బాజీరావు 2020 సెప్టెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. అప్పటి నుంచి జిల్లాలో మావోయిస్టు కదలికలు పూర్తిగా తగ్గిపోయాయి. నాలుగేళ్లుగా జిల్లాలో మావోయిస్టు కదలికలు లేవని పోలీసులు అంటున్నారు.



యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్న ఎస్పీ శ్రీనివాస్ రావు, పోలీసులు

### గిరిజనుల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు



అంసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారితో గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే పోలీసు శాఖ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. జిల్లాలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గింది. నాలుగేళ్ల క్రితం కదంబా అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయిన తర్వాత జిల్లాలో ఎక్కడ కూడా మావోయిస్టు కదలికలు కనిపించలేదు. పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడా నుంచి చౌదరి అంకుబాయి ఒక్కరే మావోయిస్టులో ఉన్నట్లు సమాచారం ఉంది. ఆమె కూడా జనజీవన స్రవంతిలో కలవాలని కోరుకుంటున్నాం. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఆనుకొని ఉన్న చత్తీస్‌గఢ్‌తోపాటు మావోయిస్టు ప్రభావం ఉన్న ఇతర ప్రాంతాల నుంచి ఆసిఫాబాద్ జిల్లాలోని మావోయిస్టులు జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్‌లు జరుగుతున్నాయి. నాలుగేళ్లుగా జిల్లాలో మావోయిస్టు కదలికలు లేవు. జిల్లా ప్రజలకు పూర్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ నిరంతరం పని చేస్తున్నది.

**- డీ.వీ. శ్రీనివాస్ రావు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ**

# తెలంగాణ మణి కిరీటం.. సింగరేణికి 135 వసంతాలు

- ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు విస్తరణ
- బొగ్గు ఆధారిత అనుబంధ, విద్యుదుత్పత్తి పరిశ్రమల స్థాపనలో ప్రగతి



శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు



రెబ్బెన : గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్




*తెలంగాణ మణి కిరీటం, నల్ల బంగారు మాగాణి సింగరేణి సంస్థ ఆవిర్భవించి 135 వసంతాలు పూర్తి చేసుకొని 136వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. సంస్థ పరిధిలో మరో 100 సంవత్సరాలకు పైగా బొగ్గు ఉత్పత్తికి అవకాశాలున్నాయి. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 10 సంవత్సరాల్లో ఉత్పత్తి విషయంలో 200 శాతం అభివృద్ధి సాధించింది. 20 వేల మంది యువతకు కేసీఆర్ సర్కారు ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి కల్పించారు. నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం.*

శ్రీరాంపూర్, డిసెంబర్ 22: రాష్ట్రంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఇల్లందు ప్రాంతంలో పరిశోధనలు చేసి 1871లో బొగ్గు నిక్షేపాలున్నట్లు గుర్తించింది. 1886లో హైదరాబాద్ దక్కన్ కంపెనీ తవ్వకాలు ప్రారంభించింది. ఇల్లందు సమీపంలోని సింగరేణి గ్రామంలో తొలిసారిగా 1889లో ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. 1920 డిసెంబర్ 23న హైదరాబాద్ దక్కన్ కంపెనీ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా మారింది. ప్రస్తుతం ఆరు జిల్లాల్లో 11 ఏరియాల్లో బొగ్గు నిక్షేపాలను వెలికితీస్తున్నది. దీంతో పాటు ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు విస్తరిస్తున్నది. బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు, సంస్థకు కావాల్సిన వస్తు సామగ్రిని సైతం సొంతంగా తయారు చేసి అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నది.

### విద్యుదుత్పత్తిలో పురోగతి

జైపూర్ ఎస్టీపీపీలో 1200 మెగావాట్ల విద్యుత్ తయారీ కేంద్రం ఉంది. అందులోనే మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. సింగరేణి వ్యాప్తంగా నిర్మిస్తున్న సోలార్ పవర్ ప్లాంట్లలో భాగంగా నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్లను కరీంనగర్‌లోని దిగువ మానేరు జలాశయంపై ఏర్పాటు చేయనున్నది. సింగరేణి వ్యాప్తంగా 550 మెగావాట్ల(డీసీ)ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జైపూర్ ఎస్టీపీపీలో 10 మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఒడిశాలో రాష్ట్రంలో సింగరేణి సంస్థ ప్రారంభించనున్న నైనీ బ్లాక్‌లో మొత్తం 340 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలుండగా ఈ గని నుండి ఏడాదికి 10 మిలియన్ టన్నుల చొప్పున 38 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయనుంది. దేశంలో తొలిసారిగా భూగర్భం నుంచి ఉబికి వచ్చే వేడి నీటితో విద్యుత్‌ను తయారు చేసే (జియోథర్మల్) కేంద్రాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మణుగూరు ఏరియా పరిధిలోని పగిడేరులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.




### ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

శ్రీరాంపూర్/ మందమర్రి/ రెబ్బెన, డిసెంబర్ 22 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియం, మందమర్రి ఏరియాలో మందమర్రిలోని సింగరేణి పాఠశాల మైదానం, బెల్లంపల్లి ఏరియాలో గోలేటిలోని భీమన్న క్రీడా మైదానం ముస్తాబైంది. ఫుడ్ స్టాళ్లు, సూపర్ బజార్ స్టాల్, ఎంవీటీసీ, రెస్క్యూ, వైద్యారోగ్య శాఖ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. వేడుకలతో పాటు స్టాళ్ల ఏర్పాట్లను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్, అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పరిశీలించారు. వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం సింగరేణి జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం ఉంటుందని అధికారులు తెలిపారు. వేడుకల్లో కార్మికులు, అధికారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మందమర్రిలో సింగరేణి పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం, అధికారులు





